క్లుప్తంగా

సైనిక్ స్కూల్‌కు సంగం విద్యార్థి


వురిమిండి వెంకట వీరేంద్రరెడ్డి

సంగం : మండల కేంద్రమైన సంగం శ్రీభారతి విద్యానికేతన్‌కు చెందిన వురిమిండి వెంకట వీరేంద్రరెడ్డి అనే విద్యార్థి సైనిక్ స్కూల్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది అర్హత సాధించారు. 2024 జనవరి 28న దేశవ్యాప్తంగా జరిగిన ఏఐఎస్ఎస్ఈఎఫ్–2024 పరీక్షలో 300 మార్కులకు 250 మార్కులు సాధించి అర్హత సాధించారు. మూడో రౌండ్ కౌన్సెలింగ్‌లో తమిళనాడు రాష్ట్రంలోని ట్యూటికోరన్‌లో ఉన్న శ్రీనివాస సైనిక్ స్కూల్‌లో ప్రవేశ అర్హత పొందారు. అనంతసాగరం మండలం పాతళపల్లికి చెందిన సాధారణ రైతు వురిమిండి పోలిరెడ్డి, విజయేశ్వరి దంపతుల కుమారుడు వీరేంద్రరెడ్డి సైనిక్ స్కూల్‌లో అర్హత సాధించడం పట్ల కుటుంబసభ్యులు, స్కూల్ యాజమాన్యం తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపల్ ఏడుకొండలు

సంగం : సంగంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఏడుకొండలు తెలిపారు. ఆయన గురువారం కళాశాలలో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా జూన్ 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎలక్ట్రీషియన్ 40, ఫిట్టర్ 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇతర వివరాల కోసం 98667 20544, 99639 50604, 63005 99477 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గంగమ్మకు పొంగళ్లు


పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు

వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని శంఖవరంలో వర్షాలు కురవాలని గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది సక్రమంగా వర్షాలు లేక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గంగమ్మ తల్లికి పొంగళ్లు పెడితే వర్షాలు కురుస్తాయన్న గ్రామస్తుల నమ్మకం. ఈ క్రమంలో ప్రజలు పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండలంలోని పందిపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపించారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

దుత్తలూరు : దుత్తలూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్ర, శనివారాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు డిస్కమ్ ఏఈ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. సోమలరేగడ, లక్ష్మీపురం వ్యవసాయ ఫీడర్లకు సంబంధించి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 వరకు త్రీఫేజ్ ఉంటుందన్నారు. మిగిలిన సమయంలో సింగిల్‌ఫేజ్ ఉంటుందన్నారు. దుత్తలూరులో 24 గంటలూ త్రీఫేజ్ ఉంటుందన్నారు. నందిపాడు, ఏరుకొల్లు ఫీడర్లక సంబంధించి మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 7 గంటల వరకు త్రీఫేజ్ ఉంటుందని, మిగిలిన సమయంలో సింగిల్ ఫేజ్ సరఫరా ఉంటుందన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో గర్భిణి మృతి

అల్లూరు : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గర్భిణి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలి భర్త లక్ష్మయ్య వివరాల మేరకు.. అల్లూరు మండలం ఇందుపూరు ఎస్టీ కాలనీ చెరువుకట్టపై లక్ష్మయ్య, పోలమ్మ(45) దంపతులు ఉంటున్నారు. వారికి నలుగురు సంతానం ఉండగా, ఐదోసారి ఆమె గర్భం దాల్చింది. కొన్నాళ్లుగా ఆమె సంగం మండలం పడమటిపల్లిలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. గత నెల 18న ఇందుపూరు గ్రామానికి రావడంతో ఆశా వర్కర్, ఏఎన్ఎం వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. నెలలు నిండడంతో మంగళవారం సాయంత్రం అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు బుధవారం ఉదయం డెలివరీ అయ్యే అవకాశం ఉందని అడ్మిట్ చేయమని చెప్పారు. ఈ క్రమంలో భర్తతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. డాక్టర్లు పరిశీలించగా అప్పటికే మరణించింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు చేశారు. కాగా వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ నేత పోలయ్య రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు.

ఊరూ వాడా.. కౌంటింగ్ టెన్షన్

ఓట్ల లెక్కింపునకు ముమ్మరంగా ఏర్పాట్లు
- అందరిలోనూ తీవ్ర ఉత్కంఠత
- ఏ సెంటర్‌లో చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ



ఆత్మకూరు : గతంలో ఎన్నడూ లేనివిధంగా సార్వత్రిక ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు ఎప్పుడెప్పుడా అని అటు ప్రజలు, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల ఫలితాలు వైఎస్సార్‌సీపీ వైపే ఏకపక్షంగా ఉంటాయని అనేక మంది చర్చించుకుంటుండగా, పోటాపోటీగా ఉండొచ్చని పలువురు వాదిస్తున్నారు. అయితే పలుచోట్ల చర్చల్లో సంక్షేమ పథకాలతో మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని, ఆ పథకాలే వైఎస్సార్‌సీపీని ముందుకు నడిపించి మరోసారి అధికారం వచ్చేలా చేయనున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా ఏ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుందనే లెక్కలను ఆయా పార్టీల నేతలు ముందుగానే అంచనాలు వేసుకుంటున్నారు. జూన్ 4 మంగళవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియ కోసం అటు జిల్లా అధికారులు, ఇటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. 2019లో ఎన్నికల పోలింగ్, ఫలితాల మధ్య 41 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. అయితే ఈ ఏడాది పోలింగ్ జరిగిన 21 రోజులకే కౌంటింగ్ నిర్వహించనున్నా ప్రజల్లో ఉత్కంఠత గతం కంటే అధికంగా ఉందని పలువురు విశ్లేషిస్తున్నారు. కౌంటింగ్‌కు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. వచ్చే మంగళవారం ఉదయం 8 నుంచి నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. కాగా ఒక్కో రౌండ్‌కు కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు సమయం పడుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి ఫలితం వెలువడుతుందని అధికారులు తెలిపారు.

కౌంటింగ్ ఇలా..

ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి నెల్లూరు ప్రియదర్శిని కళాశాలలోని థర్డ్ బ్లాక్ సెమినార్ హాల్ 405లో లెక్కింపు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ల కౌంటింగ్ కోసం రూమ్ నంబర్ 401ను కేటాయించారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గంలో 1,79,829 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లలో భాగంగా ఉద్యోగులు, హోమ్ ఓటింగ్, దివ్యాంగుల ఓట్లు మొత్తం 3,150 మంది పోలైంది. ఇందుకోసం రెండు కౌంటింగ్ టేబుళ్లను అదనంగా ఏర్పాటు చేశారు. 278 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేయగా, 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ఇప్పటికే కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. 31వ తేదీలోపు ఏజెంట్లను నియమించుకుని సంబంధిత జాబితాలు అధికారులకు అందజేయాల్సి ఉంది.

ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే చర్యలు


సంగం : చెన్నవరప్పాడులో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్సై


అల్లూరు : కార్డన్ సెర్చ్‌లో ఎస్సై శ్రీనివాసులురెడ్డి


చేజర్లలో మాట్లాడుతున్న సీఐ రవినాయక్

సంగం : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రమాదేవి, ఎస్సై నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని చెన్నవరప్పాడు, తలుపూరుపాడు గ్రామాల్లో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయోత్సవాలు, బాణసంచాలు పేల్చడం, ర్యాలీలు వంటివి చేయకూడదని తెలియజేశారు.

అల్లూరులో కార్డన్ సెర్చ్

అల్లూరు : స్థానిక గాంధీ కాలనీలో ఎస్సై పి.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు తనఖీలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అనుమానితుల ఇళ్లల్లో తనఖీలు చేసి ఏదైనా ఆయుధాలు ఉంటే స్వాధీనం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

చేజర్ల : మండల కేంద్రమైన చేజర్లలో పోలీసులు, కేంద్ర బలగాలు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించాయి. మొదట గ్రామంలో మార్చ్ ఫాస్ట్ చేపట్టారు. ఈ సందర్భంగా సంగం సీఐ రవినాయక్ మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ రోజు ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. బాణసంచా కాల్చినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

2న వైద్య శిబిరం

ఆత్మకూరు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రెండు నెలలకు ఒకసారి నిర్వహించే వైద్యశిబిరాన్ని జూన్ 2వ తేదీ ఆదివారం స్థానిక శ్రీశిరిడీ సాయిరామ్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జేవీవీ నిర్వాహకులు గురువారం తెలిపారు. బీపీ, షుగర్ లాంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తక్కువ ధరకే రెండు నెలలకు సరిపడా మందులు అందజేయనున్నట్లు తెలియజేశారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ వెంకట రమణారెడ్డి గురువారం తెలిపారు. గత రెండు రోజుల నుంచి నెల్లూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ కొనసాగుతోందని, ర్యాంక్ హోల్డర్లు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

పింఛన్ల పంపిణీపై సమావేశం


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

అల్లూరు : జూన్ నెల పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ జ్యోతి తన కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరు మండల వ్యాప్తంగా మొత్తం 7,406 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. మే నెలలో 99.49 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేశామన్నారు. గత నెలలో ఎలా పింఛన్లను పంపిణీ చేశారో అదేవిధంగా కొనసాగించాలన్నారు. జూన్ నెలలో కూడా వందశాతం పింఛన్లను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఫణికుమార్, ఈఓపీఆర్డీ వీరేంద్ర పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ


సమావేశంలో పాల్గొన్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

మర్రిపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించడం తదితర అంశాలను మండల రిసోర్స్‌పర్సన్ రాజేంద్రకుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 ధనలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అన్ని పోషకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు కస్తూరయ్య, తిరుపతయ్య, పట్టాభి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీసీజీ వ్యాక్సినేషన్


సీతారామపురం : వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది


కొండాపురం : వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది


సోమశిల : బీసీజీ టీకా వేయించుకుంటున్న పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లి, సోంపల్లి, రంగనాయుడుపల్లి, సీతారామపురం, బోడసిద్ధాయపల్లి, పండ్రంగి తదితర గ్రామాల్లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ గురువారం ముమ్మరంగా జరిగింది. మొత్తం 375 మంది వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమాన్ని వైద్యాధికారిణి భవ్యశ్రీ పరిశీలించి క్షయ వ్యాధి సోకకుండా ముందస్తుగా పెద్దలకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

331 మందికి టీకా

వరికుంటపాడు : మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 331 మంది వయోజనులకు టీబీ వ్యాధి సోకకుండా బీసీజీ టీకాలు వేసినట్లు మండల వైద్యాధికారిణి కరిష్మా తెలిపారు. ఆమె మండల పరిధిలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని గురువారం తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బీసీజీ టీకాతో క్షయవ్యాధికి చెక్ పెట్టవచ్చని తెలిపారు. వయోజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

326 మందికి..

కొండాపురం : మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 326 మందికి గురువారం బీసీజీ వ్యాక్సిన్లు వేసినట్లు కొండాపురం సీహెచ్‌ఓ చెంచురామయ్య తెలిపారు. ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్లను 60 ఏళ్లు పైబడిన వారికి వేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మూడు గురువారాలు కలిపి 1,146 మందికి వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దల కోసం బీసీజీ టీకా

సోమశిల : భారత ప్రభుత్వం క్షయవ్యాధి నివారణకు పెద్దల కోసం బీసీజీ టీకాను ఉచితంగా అందిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అనంతసాగరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పలువురికి బీసీజీ వ్యాక్సిన్‌ను వేశారు. అందులో భాగంగా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులు, వైద్యసిబ్బంది బీసీజీ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అనంతసాగరం మండలంలో 1,663 మంది బీసీజీ వ్యాక్సిన్ వేయించుకున్నారని, ఎవరికీ తీవ్రమైన దుష్ప్రభావాలు కలగలేదని తెలిపారు. మండలంలోని పెద్దలు బీసీజీ టీకాను వేయించుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న నేతలు

ఉదయగిరి : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఉదయగిరిలోని పార్టీ కార్యాలయంలో గురువారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చిన సీఎం జగన్ ప్రజల అభిమానం చూరగొన్నారన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో 150కి పైగా స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, స్థానిక నేతలు జి.శ్రీనివాసులురెడ్డి, ముర్తుజా హుస్సేన్, గడియాల్చి యస్దాని, గౌస్‌మొహిద్దీన్, ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎల్.అశోక్‌కుమార్, రాపల్లి తిరుపతి, ఇత్తడి రమణయ్య, ఉప్పుటూరి శ్రీను, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చారిత్రక గెలుపు తథ్యం


మాట్లాడుతున్న బీసీ నేతలు

సీతారామపురం : రానున్న ఎన్నికల ఫలితాల్లో జగనన్న చారిత్రక గెలుపు తథ్యమని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు పేర్కొన్నారు. చంద్రబాబు అరాచక పాలనకు చరమగీతం పాడి ప్రజాపరిపాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికి గురువారం నాటికి ఐదేళ్లయిన సందర్భంగా ఆయన సీతారామపురంలో విలేకరులతో మాట్లాడారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, విజయసాయిరెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గోరంట్ల తిరుపాలు, మాజీ సర్పంచ్‌లు మద్దినేని శ్రీనివాసులు, పాణెం చంద్రమౌళి, రైతు విభాగ నాయకుడు అల్లూరురెడ్డి, మత్స్యకార సంఘ నేత శేఖర్, ట్రేడ్ యూనియన్ నేత ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియను బాధ్యతగా నిర్వహించాలి

- ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్


కౌంటింగ్ సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్వో

ఉదయగిరి : కౌంటింగ్ ప్రక్రియను బాధ్యతగా నిర్వహించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. అనంతరం ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. సమయానికి ముందే కౌంటింగ్ కేంద్రానికి చేరుకుని రిపోర్టు చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో ఏఈఆర్‌ఓ నెహ్రూబాబు తదితరులు పాల్గొన్నారు.

104 ద్వారా వైద్యసేవలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

సీతారామపురం : స్థానిక బిట్–1 సచివాలయ పరిధిలోని పడమటి వీధిలో 104 వాహనం ద్వారా గురువారం 55 మందికి వైద్యసేవలు అందించినట్లు వైద్యాధికారిణి భవ్యశ్రీ తెలిపారు. రోగులకు బీపీ, షుగరు వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణుల ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ చూపాలన్నారు. గ్రామీణ పేదలకు ఎంతో మేలు చేకూరే ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్వీకండ్రికలో..

చేజర్ల : మండలంలోని ఎన్వీకండ్రిక (నూతక్కివారి కండ్రిక) పంచాయతీ కార్యాలయంలో 104 వాహనం ద్వారా రోగులకు వైద్యసేవలను గురువారం అందించారు. రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ముగ్గురు గర్భిణులను పరీక్షించి వైద్య సలహాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, సీహెచ్‌ఓ మంజుల, ఏఎన్ఎం ప్రసన్న, సిబ్బంది వేణు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం


పల్లకిసేవలో భగవాన్ శ్రీవెంకయ్యస్వామి


విద్యుద్దీపాలంకరణలో ఆలయం

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని వడ్డిపాళెం గ్రామంలో కొలువైన భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి పల్లకిసేవతో పాటు విశేష పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యాకానుక స్టాక్ తనిఖీ



చేజర్ల : మండల కేంద్రమైన చేజర్ల విద్యావనరుల కేంద్రంలో విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ గోపాల్ గురువారం తనిఖీ చేశారు. పాఠ్య పుస్తకాలను వివిధ గదుల్లో భద్ర పరచడంపై ఆరాతీశారు. అనంతరం మండల ఎంఆర్సీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తర్వాత గోపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మస్తానయ్య పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద మౌలిక వసతులు కల్పించాలి


ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్

సీతారామపురం : పింఛన్‌దారుల కోసం బ్యాంకుల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ బ్యాంకు అధికారులను కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 1న మధ్యాహ్నం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ సొమ్ము జమ అవుతుందన్నారు. ఆదివారం బ్యాంకు సెలవు కావడంతో సోమ, మంగళవారాల్లో లబ్ధిదారులు పింఛన్ సొమ్ము కోసం వస్తారని, ఈ క్రమంలో బ్యాంకుల వద్ద షామియానాల ఏర్పాటు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలామ్ ఆజాద్ గురువారం తెలిపారు. ఈ సమావేశంలో విద్య, వ్యవసాయం, తాగునీరు, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నందున మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు మండల అధికార యంత్రాంగం విధిగా హాజరు కావాలన్నారు.